ఎండీయూ వాహనాలకు బ్రేక్ !

- ఇకనుంచి రేషన్‌షాపుల నుంచే సరుకులు...
- ఆ దిశగా కసరత్తు చేస్తున్న కూటమి ప్రభుత్వం
- ఆందోళనలో రేషన్ కార్డుదారులు



గండేపల్లిలో ఎండీయూ వాహనం వద్ద రేషన్ బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

కంచికచర్ల: కూలీలు, మహిళలు, దివ్యాంగులు, పేదలంతా వ్యయప్రయాసలకు గురికాకుండా వారికి ఇంటివద్దనే రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ)వాహనాల సేవలకు త్వరలో బ్రేక్ పడనుంది. ఇక నుంచి రేషన్ దుకాణాల ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేసేలా కూటమి ప్రభుత్వం సమాలోచనలు చేస్తుండటమే ఇందుకు కారణం. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ)వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. రేషన్‌కార్డుదారులందరికీ ప్రతినెలా వారి ఇంటివద్దనే సరుకులు పంపిణీ చేశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ వ్యవస్థను రద్దుచేసి, తిరిగి రేషన్ డీలర్ల ద్వారా ప్రజలకు రేషన్‌సరుకులు పంపిణీ చేసేందుకు సమాయత్తమవుతోందని సమాచారం. ఇందుకోసం ఇప్పటికే కసరత్తును ప్రారంభించిన కూటమి ప్రభుత్వం త్వరలోనే నూతన విధానాన్ని అమలుచేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

58ఎండీయూ వాహనాలు...

నందిగామ నియోజకవర్గంలో 58మంది ఎండీయూ వాహనాలున్నాయి. కంచికచర్ల మండలంకు 15, నందిగామకు 17, చందర్లపాడులో 14, వీరులపాడులో 12 ఎండీయూ వాహనాల ద్వారా ప్రతినెలా పేదలకు రేషన్‌సరుకులు అందిస్తున్నారు. ఈ ఎండీవయూ వాహనాలను తొలగించేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు ప్రారంభించగా, రాష్ట్ర పౌరసరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదిశగా ప్రకటన కూడా చేశారు. రాష్ట్రంలోని ఎండీయూ వాహనాలను తొలగించాలంటూ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఎండీయూ వాహనాల వ్యవస్థ రద్దయితే దూరప్రాంతంలోని రేషన్‌దుకాణాలకు వెళ్లి సరుకులు తెచ్చుకోక తప్పదని వృద్ధులు, దివ్యాంగులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా రేషన్ సరుకుల కోసం పనులు మానుకోక తప్పేలా లేదని కూలీలు చెబుతున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం పునరాలోచన చేసి ఎండీయూ వాహనాల వ్యవస్థను కొనసాగించాలని రేషన్ కార్డుదారులు కోరుతున్నారు.

ఆందోళనలో వృద్ధులు, దివ్యాంగులు..

గత ఐదేళ్ల పాటు రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులు ఇంటి వద్దనే తీసుకున్నారు. ఎండీయూలు లబ్ధిదారులకు రేషన్‌బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార తదితర నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేశారు. పేదలు రేషన్ దుకాణాల వద్దకు వెళ్లాల్సిన పనిలేకుండా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎండీయూ వాహనాల ద్వారా ప్రతినెలా సరుకులు పంపిణీ చేశారని లబ్ధిదారులు గుర్తుచేసుకుంటున్నారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ వాహనాలను రద్దు చేస్తే తాము రేషన్ సరుకులు ఎలా తెచ్చుకోగలమని వృద్ధులు, దివ్యాంగులు ఆందోళన చెందుతున్నారు.

ఇంటి వద్దనే ఇస్తే మాకు మేలు...



నేను నడవలేను. నాకు అంత్యోదయ కార్డు ద్వారా ప్రతినెలా 35కేజీల బియ్యం వస్తాయి. ఎండీయూ వాహనం ద్వారా ఇంటివద్దనే ప్రతినెలా రేషన్ బియ్యం తీసుకుంటున్నా. ఈ వాహనాన్ని రద్దు చేస్తే నేను రేషన్ దుకాణం వద్దకు వెళ్లి సరుకులు ఎలా తెచ్చుకోగలను .

–మార్కపూడి కౌశల్య, వృద్ధురాలు, గండేపల్లి

ప్రభుత్వం పునరాలోచించాలి...



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎండీయూ వాహనాలను తొలగించాలని ఆలోచన చేయడం బాధాకరం. దూరంగా ఉన్న రేషన్ దుకాణం నుంచి వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు రేషన్ తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడాల్సిందే. ఎండీయూ వాహనాల తొలగింపు వ్యవహారంపై కూటమి ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

–కంచర్ల పద్మావతి, మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు, పరిటాల

క్లుప్తంగా

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జడ్జి శ్రీనివాసరావు

నందిగామటౌన్: స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 16వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు సూచించారు. లక్ష్మీ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఇటువంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆస్పత్రి వైద్యులు కోర్టు సిబ్బంది, న్యాయవాదులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు సూపరింటెండెంట్ జ్యోతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబు విద్యాసాగర్, న్యాయవాది చెరుకుపల్లి రామారావు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పల్లకీ సేవ పునరుద్ధరణ



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో పల్లకీసేవ, రథంపై ప్రాకారోత్సవం కార్యక్రమాలను పునరుద్ధరించారు. స్వామివార్లకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ చేశారు. ఇకనుంచి ప్రతి శుక్రవారం ఏడుగంటలకు పల్లకీసేవ, ఆదివారం రాత్రి తొమ్మిది గంటలకు ప్రాకారోత్సవం నిర్వహిస్తామని ఆలయ ఈఓ భూపతిరాజు వెంకట సత్యనాగ కిషోర్‌కుమార్ తెలిపారు. పల్లకీసేవ, ప్రాకారోత్సవాలను పునరుద్ధరించడంపై భక్తులుహర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఘనంగా న్యూట్రిషన్ ఫుడ్ ఫెస్ట్



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని వాగ్దేవి నర్సింగ్ కళాశాలలో సెకండ్ ఇయర్ బీఎస్సీ నర్సింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం న్యూట్రిషనల్ ఫుడ్‌ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. పోషక విలువలు ఉండే ఆహార పదార్థాలను తయారుచేసి ప్రదర్శించారు. పోషకాహార ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ సరిత, ప్రిన్సిపాల్ బుస్సు సురేష్, డైరెక్టర్ కేఎస్సార్, నర్సింగ్ కళాశాల ఫ్యాకల్టీ సభ్యులు ఈశ్వరీ, ప్రవీణ, గ్రీష్మ పాల్గొన్నారు.

113 కేసులు పరిష్కారం



కంచికచర్ల: నందిగామ కోర్టులో న్యాయమూర్తి షేక్ రియాజ్ ఆధ్వర్యంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. కంచికచర్ల ఎక్సైజ్ శాఖకు సంబంధించిన 45 కేసులు పరిష్కారమైనట్లు ఎక్సైజ్ సీఐ షేక్ అఫ్రపున్నీసా బేగం తెలిపారు. ఆయా కేసుల్లోని వారికి రూ.2,34,350లు జరిమానా విధించినట్లు వివరించారు. ఎస్ఐ షేక్ గాలీబ్‌సాహెబ్, న్యాయవాదులు పాల్గొన్నారు. అదేవిధంగా లోక్‌ఆదాలత్‌లో 68కేసులు పరిష్కారమైనట్లు ఎస్ఐ బోనగిరి రాజు తెలిపారు. న్యాయమూర్తి షేక్ రియాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్‌ఆదాలత్‌లో కంచికచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని 68 సివిల్, క్రిమినల్ పరిష్కారమైనట్లు ఆయన వివరించారు.

వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే



ఊరచెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఊరచెరువు వద్ద ఉన్న వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి శనివారం ఆయన ఊరచెరువును పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ చెరువులో తొలగించి వాకింగ్ ట్రాక్‌పై పడేసిన తూటి కాడను అక్కడ్నుంచి తొలగిస్తున్నామన్నారు. ఊరచెరవు వాకింగ్ ట్రాక్‌ను దశలవారీగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ఓపెన్ జిమ్, బెంచీలు, మినీ క్యాంటీన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వాకింగ్ ట్రాక్‌కు రెండు వైపులా పచ్చదనాన్ని పెంచుతామని వివరించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధా, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, ఇర్రి నరసింహారావు, వెంకట్, సైదేశ్వరరావు, నాయకులు కర్ల జోజి, తమ్మిశెట్టి నరసింహారావు, సతీష్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

17న ఆటోడ్రైవర్ల అవగాహన సదస్సు



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ రాజు, సీఐటీయూ నాయకులు

కంచికచర్ల: ప్రజారవాణా వ్యవస్థలో ఆటోడ్రైవర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, అటువంటి వారిని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు ముల్లంగి సోమేశ్వరరావు కోరారు. ఈనెల 17న కంచికచర్ల ఎన్జీఓస్ హోంలో నిర్వహించే ఆటోడ్రైవర్ల అవగాహన సదస్సు గోడపత్రికను స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ బోనగిరి రాజు శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల కోసం ప్రభుత్వం సంక్షేమ నిధి ఏర్పాటు చేసి ఆర్థికసాయం అందించాలన్నారు. అవగాహన సదస్సుకు నందిగామ రూరల్ సర్కిల్ సీఐ డి.చవాన్, నందిగామ ఆర్డీఓ ఎం.పద్మావతి, ఎస్ఐ రాజు, సీఐటీయూ నాయకులు సీహెచ్ శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ తదితరులు హాజరుకానున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బెజ్జం భూషణం, ఆటోవర్కర్లు యూనియన్ నాయకులు నాగరాజు, బుజ్జి, మరియదాసు, మల్లేశ్వరరావు, శివరాం, ప్రభాకర్, వెంకటేశ్వరరావు భగవాన్, శౌరి, ఆశోక్‌బాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు



బలుసుపాడు(జగ్గయ్యపేటఅర్బన్): మండలంలోని బలుసుపాడులో సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సీఎస్ఐ గ్రౌండ్‌లో పాస్టర్ ఎస్.అభిలాష్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో జగ్గయ్యపేట సొత్ డీసరీ చైర్మన్ రెవ జి.దర్శన్‌సుందర్, జ్యోతిదర్శన్ ముఖ్యఅతిథులుగా పాల్గొని క్రిస్మస్ సందేశమిచ్చారు. యేసుక్రీస్తు ప్రేమ, దయ, కరుణకు ప్రతిరూపమన్నారు. యేసు చూపిన జీవిత విధానాన్ని అవలంబిస్తూ జీవితం సాగించినపుడే క్రైస్తవులుగా పిలువబడతామన్నారు. క్రీస్తు ఆచరించి చూపించిన జీవితాన్ని ఆచరించడమే నిజమైన క్రిస్మస్ అని పేర్కొన్నారు. తొలుత పాస్టర్లతో కలిసి కేక్‌ను కట్ చేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పాస్టర్లు ఎస్.సమత అభిలాష్, బొక్కా సుధాకర్, దారా జగన్, దియ్యాల వెంకటరత్నం, మేరుగు ఆదాం, చర్చి సంఘ పెద్దలు, సంఘస్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం



అనుమంచిపల్లిలో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటున్న సభ్యులు



ఎన్నికల అధికారితో పెనుగంచిప్రోలు మేజర్-1 ఎన్నెస్పీ కాల్వ కార్యవర్గ సభ్యులు



ఇందుగపల్లిలో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్న అధికారులు

జగ్గయ్యపేట: నియోజకవర్గంలో ఉన్న మొత్తం 31మేజర్, మీడియం, మైనర్ నీటిసంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. కొన్ని గ్రామాల్లో కూటమి నాయకులే రెబల్ అభ్యర్థులుగా పోటీ చేసి ఎన్నికల వరకు వెళ్లారు. నీటిసంఘాల ఎన్నికలను అప్రజాస్వామికంగా నిర్వహిస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసన వైఎస్సార్ సీపీ ఈ ఎన్నికలను బహిష్కరించింది.

జగ్గయ్యపేట మండలంలో...

అనుమంచిపల్లిలో 12టీసీలుండగా తొమ్మిది టీసీలు ఏకగ్రీవంకాగా, మూడు టీసీలకు నామినేషన్లు రాలేదు. పోచంపల్లిలో 12టీసీలుండగా ఏడు టీసీలు ఏకగ్రీవమవ్వగా ఐదు టీసీలలో కూటమి అభ్యర్థులు రెబల్‌గా పోటీచేశారు. అనుమంచిపల్లి నీటిసంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా కానూరి కిషోర్, మందాడ పూర్ణచంద్రరావు, పోచంపల్లిలో తేళ్లూరి వెంకటకృష్ణారెడ్డి, కావూరి రాంబాబు, బూదవాడలో దారావత్ బాల్యా, వంకా ఏసుబాబు, చిల్లకల్లులో గేలం కృష్ణ, బోయపాటి రాము, గండ్రాయిలో మేదూరి రమేష్, బొమ్మనబోయిన శ్రీనివాసరావు, గండ్రాయి చెరువుకు కొత్తపల్లి ఏసు, ముండ్లపాటి బేబీ సునీత అధ్యక్ష,ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: మండలంలో నీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం మేజర్, మీడియం, మైనర్ కలిపి 13 నీటిసంఘాలు, 144టీసీలకు ఎన్నికలు నిర్వహించారు.

ఎన్నికైన వారి వివరాలు..

పెనుగంచిప్రోలు ఎన్ఎస్పీ కాలువ మేజర్-1 అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా కర్ల నాగేశ్వరరావు, ఐనాల సాంబయ్య, పెనుగంచిప్రోలు మేజర్-2 అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా యనమదల నరసింహారావు, మునగంటి శ్రీహరి ఎన్నికయ్యారు. ముండ్లపాడు మేజర్-1కు ఏలూరి గోపాలరావు, గాదెరాజు చంద్రశేఖర్, ముండ్లపాడు మేజర్-2కు గుత్తా హనుమంతరావు, సాదినేని శేషగిరిరావు, తోటచర్ల మేజర్‌కు కమతం బ్రహ్మానందరావు, సీహెచ్ ఉద్దండు, నవాబుపేట మేజర్ ఎన్ఎస్పీ కాలువకు వడ్డే రవికుమార్, బండి సైదేశ్వరరావు, అనిగండ్లపాడు ఎన్ఎస్పీ మేజర్ కాలువకు బొమ్మిశెట్టి గోపికృష్ణ, గింజుపల్లి శ్రీను అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. మైనర్‌కు సంబంధించి నవాబుపేట రామన్నచెరువు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా గింజుపల్లి వెంకటేశ్వరరావు, బుర్రా వెంకటరావు, కొణకంచి శ్రీరామచెరువు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా నార్నె శ్రీనివాసరావు, దేవరపల్లి శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. ముచ్చింతాల అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా పద్మాల వెంకటేశ్వర్లు, జక్కులూరి వెంకటేశ్వర్లు, అనిగండ్లపాడు సంఘానికి చెరుకూరి శ్రీనివాసరావు, కనకపూడి నాగేశ్వరరావు, గుమ్మడిదుర్రుకు పొన్నం బాలాజీ, ఆరుద్ర రమేష్‌బాబు, పెనుగంచిప్రోలు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా నల్లపునేని తిరుపతిరావు, సామినేని శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నందిగామ, చందర్లపాడు మండలాల్లో..

నందిగామటౌన్: నందిగామ, చందర్లపాడు మండలాల్లోని 17నీటిసంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. నందిగామ డీసీ చైర్మన్‌గా రాటకొండ చంద్రశేఖర్, చందర్లపాడు మండల డీసీ చైర్మన్‌గా కోట వీరబాబు ఎన్నిక కూడా లాంఛనప్రాయం కానుందని సమాచారం.

వత్సవాయి మండలంలో...

వత్సవాయి: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. రామచంద్రాపురం డీసీ నంబర్-28కి మాత్రమే ఎన్నిక జరగ్గా, మిగతా సంఘాలన్నీ ఏకగ్రీవమయ్యాయి.ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయినట్లు ఎన్నికల అధికారి, తహశీల్దార్ ఎస్.నరసింహారావు తెలిపారు.

ఎన్నికైనవారి వివరాలు..

మంగొల్లు సాగునీటి సంఘ అధ్యక్షుడిగా మన్నె నారాయణ ఎన్నికయ్యారు. అలసకాని నవీన్‌కుమార్(చిన్నమోదుగపల్లి), షేక్ మహబూబ్‌హుస్సేన్(భీమవరం), పెంట్యాల వెంకటేశ్వర్లు(దబ్బాకుపల్లి), కొలగాని రామయ్య(చిట్టేల), చిట్టూరి సుబాష్(వేములనర్వ), కంచేటి లక్ష్మీనారాయణ(లింగాల), కోలేటి వెంకటేశ్వర్లు(రామచంద్రాపురం), చిరుమామిళ్ల పరమయ్య(కన్నెవీడు), ఉప్పుగండ్ల వెంకటేశ్వర్లు(వత్సవాయి), చావా శాంతిబాబు(కంభంపాడు), కంభంపాటి రమేష్(పెంట్యాలవారిగూడెం) సాగునీటి సంఘ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

నందిగామ నియోజకవర్గంలో..


కంచికచర్ల: నందిగామ డివిజన్ పరిధిలో సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఆర్డీఓ కె.బాలకృష్ణ శనివారం తెలిపారు. డివిజన్‌లోని ఎన్ఎస్పీ, మైనర్ ఇరిగేషన్, ఐడీసీ లిఫ్ట ఇరిగేషన్‌కు సంబంధించిన మొత్తం 75సంఘాలున్నాయని, వాటిలో 758 టీసీలకు ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు.

పోలింగ్ పరిశీలన..


కంచికచర్ల మండలంలో నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తహసీల్దార్ పి.జాహ్నవి తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నిక ప్రక్రియను ఆమె పరిశీలించారు.

వీరులపాడు మండలంలో...

వీరులపాడు: మండలంలోని ఏడు మేజర్, ఎనిమిది మైనర్ ఇరిగేషన్లకు శనివారం నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. జుజ్జూరు సాగర్ కెనాల్ అధ్యక్షునిగా కాపా రాంబాబు ఎన్నికయ్యారు. తహసీల్దార్ హుస్సేన్ మాట్లాడుతూ మేజర్ ఇరిగేషన్ డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఈనెల 17వతేదీ ఉదయం పది గంటలకు ఎన్నిక జరుగుతుందని తెలిపారు.



కంచికచర్లలో ఎన్నికలను పరిశీలిస్తున్న తహసీల్దార్ పి.జాహ్నవి



జుజ్జూరులో ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న అధికారులు

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు ఆటల పోటీలు



కీసర(కంచికచర్ల) : మండలంలోని కీసరలో జీసస్ క్రైస్ట్ ప్రేయర్ టవర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం ఖోఖో, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో కీసర, గండేపల్లి, వేములపల్లి, పెండ్యాల, జమ్మవరం తదితర గ్రామాల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు క్రిస్మస్ రోజున బహుమతులు అందజేస్తామని పాస్టర్ గోసంగి జాన్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు జీ హోసన్నా పాల్, ఎం డానియేల్, శంకరరావు, జాన్ అగిస్టిన్, ఏ మోషే పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతోపాటు హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పరాంకుశం సీతారామాచార్యులు,కృష్ణమాచార్యులు,వేద పండితులు పాల్గొన్నారు.

నూకేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

నందిగామ టౌన్: చందర్లపాడు మండలం చింతలపాడులో వేంచేసియున్న నూకేశ్వరీ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. బొల్లావులతో అమ్మవారి ఆలయ పునఃప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణులు, ఆర్యవైశ్యులు, కమ్మవారి బోనాలను అమ్మవారికి సమర్పించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ చైర్మన్ కందుకూరి సత్యనారాయణ, కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.